## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ మంత్రి సీతక్క

**ప్రజాశక్తి- తిరుమల:** తెలంగాణ మంత్రి సీతక్క బుధవారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయక మండలంలో శ్రీవారి తీర్థప్రసాదాలతోపాటు టిటిడి క్యాలండర్‌ను అందజేశారు. ఆలయం వెలుపల సీతక్క మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మొదటి సారి తాను తిరుమలకు వచ్చినట్లు తెలిపారు. పని ఒత్తిడి ఉండటం వల్ల మొక్కులు చెల్లించుకోవడం ఆలస్యమైందని, శ్రీవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

# ఏపీఎస్పీడీసీఎల్‌కు జాతీయ అవార్డు

### పనితీరు అంశంలో ద్వితీయ స్థానం

**ప్రజాశక్తి- తిరుపతి సిటీ:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)కు జాతీయస్థాయిలో అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈనెల 22, 23వ తేదీల్లో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో భాగంగా డిస్కమ్‌ల పనితీరు అంశంలో జాతీయ స్థాయిలో ఏపీఎస్పీడీసీఎల్ రెండవ ర్యాంకు సాధించినట్లు సదస్సు తీర్మానించింది. ఈ మేరకు బుధవారం జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు తరపున సంస్థ డైరెక్టర్, ప్రాజెక్ట్స్ (ఎఫ్ఎసి) పి.అయూబ్ ఖాన్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఛైర్మన్, కేంద్ర ఇంధనశాఖ మాజీ కార్యదర్శి అనిల్ రజ్దాన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఏపీఎస్పీడీసీఎల్ రెండవ ర్యాంకును సాధించడం పట్ల సంస్థ ఉద్యోగులు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎండీ సంతోష రావు మాట్లాడుతూ ఈ అవార్డు స్ఫూర్తితో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరు ద్వారా సంస్థ మరెన్నో అవార్డులను సాధించాలని అభిలషించారు.

జాతీయ అవార్డు అందుకుంటున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు

# ఏనుగు దాడిలో వ్యక్తి దుర్మరణం

- మృతుని కుటుంబానికి రూ.10లక్షల సాయం
- ఐదు నెలల్లో ఇద్దరు మృతి..
- హడలెత్తున్న జనం
- సోలార్ ఫెన్సింగ్, కందకాలు పూర్తి చేయాలంటున్న ప్రజలు

మృతుడు రెడ్డు నాయక్ (ఫైల్‌ఫొటో), ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

**ప్రజాశక్తి - రామకుప్పం**
చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యం సమీపంలో ఒంటరి ఏనుగు ఓ వ్యక్తిపై దాడి చేసి తొక్కి చంపిన సంఘటన రామకుప్పం మండలంలో చోటు చేసుకుంది. ఐదు నెలల వ్యవధిలో ఇది రెండవ సంఘటన కావటం దురదృష్టకరం. స్థానికుల కథనం మేరకు.. రామకుప్పం మండల పరిధిలోని పీఎంకే తాండా సమీపంలోని సాకలినత్తం కొండ ప్రాంతంలో గ్రామానికి చెందిన రెడ్డు నాయక్ (47)పై మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేయటంతో అతను మృతి చెందాడు. రెడ్డు నాయక్ వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ జీవించేవాడు. రెండు నెలల కిందట మృతుడి భార్య ప్రమీల ఆనారోగ్యంతో మృతిచెందింది. అప్పటినుంచి తరచు రెడ్డు నాయక్ అటవీ సరిహద్దు సమీపంలో ఉన్న స్మశానంలోని సమాధి వద్దకుకు వెళ్లి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవాళం వెళ్లి తిరిగి వస్తుండగా అతనిపై ఏనుగు దాడి చేయటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి సైరాజ్ అనే ఓ కుమారుడు ఉన్నాడు. బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా అటవీ అధికారి భరణి, డాక్టర్ సురేష్ మృతుని కుమారుడికి రూ.10లక్షల చెక్కును అందించారు. అనంతరం ఘటనా స్థలాన్ని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎఫ్ఆర్ఓ జయశంకర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇక్కడి సమీపంలోని పిఎం తాండా వద్ద జూన్ 16వ తేదీన కన్నా నాయక్ ఒంటరి ఏనుగు దాడిలో మరణించారు. తరచు ఏనుగులు గ్రామాలపై పడి మనుషుల ప్రాణాలు తీస్తుండడంతో అటవీ సరిహద్దు ల్లోని గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలెత్తి పోతున్నారు. ఏనుగు దాడులకు శాశ్వత పరిష్కారం చూపటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కుప్పం నియోజకవర్గ అటవీ సరిహద్దు ప్రాంతం చుట్టూ అసంపూర్తిగా మిగిలి ఉన్న కందకాలు పూర్తి చేయించడంతో పాటు సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అటవీ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

### దళిత సంఘమిత్రలపై
## 'అధికార' వేధింపులు మానాలి : సీఐటీయూ

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు పెచ్చుమీరాయని సీఐటీయూ నాయకులు విమర్శించారు. పలువురు దళిత సంఘమిత్రల పొట్టగొట్టారని మండిపడ్డారు. స్థానిక తొట్టంబేడు వెలుగు కార్యాలయం వద్ద సంఘమిత్రలపై జరుగుతున్న రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం సిఐటియు నాయకులు నిరసన తెలిపారు. పలుచోట్ల గ్రామసభ తీర్మానం లేకుండానే పలువురు దళిత మహిళా సంఘమిత్రలను తొలగించడం చట్ట విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలుగు అధికారులు కూడా కూటమి నేతలకు సహకారం అందిస్తుండడంతో రాజకీయ వేధింపులు తారాస్థాయికి చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారుల్లో మార్పు రాకుంటే న్యాయస్థానాల వద్ద సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు గంధం మణి, వెంకటేష్, పలువురు సంఘమిత్రులు పాల్గొన్నారు.

## విశాఖలో సిజిహెచ్‌ఎస్ ప్రాంతీయ కార్యాలయం

### ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ల పర్యవేక్షణకు కోసం ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్‌ని నియమించమని కోరుతూ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆగస్టు నెలలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రెటరీ రోలో సింగ్‌ని కలవడం జరిగింది. ఆ సందర్భంలో రాష్ట్రాల పునర్విభజన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్‌లోని సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్లను తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సిజిహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ నియంత్రణలో ఉన్నాయని ఎంపి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. శస్త్రచికిత్సలు, ప్రత్యేక చికిత్స, బిల్లుల రీయింబర్స్మెంట్, మందుల జారీకి సంబంధించిన అన్ని అనుమతులు హైదరాబాద్ సిజిహెచ్‌ఎస్ పరిధిలోని అంశాలు కావడం ఆంధ్రప్రదేశ్ వెల్‌నెస్ సెంటర్లు హైదరాబాద్‌కి దూరంగా ఉండటంతో పలురకాల అనుమతులు, మందులు మొదలైన వాటిని పొందడంలో జాప్యానికి కారణమవుతోందని వివరించారు. అలాగే తిరుపతిలోని సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ ఏర్పాటు ప్రక్రియని వేగవంతం చేస్తూ సిజిహెచ్‌ఎస్ ప్రాంతీయ కార్యాలయాన్ని తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రెటరీ రోలో సింగ్ స్పందిస్తూ ఇప్పటికే సేవలు అందిస్తున్న 5 సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్లలో రెండు విశాఖ పట్టణానికి దగ్గరలో ఉండటం వలన సిజిహెచ్‌ఎస్ ప్రాంతీయ కార్యాలయ విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. అలాగే తిరుపతి సిజిహెచ్‌ఎస్ వెల్‌నెస్ ఏర్పాటు కూడా పరిగణలో ఉందని తెలియజేశారు.

## ఆడ పిల్లలను రక్షించుకుందాం : డిఆర్‌ఓ

సమావేశంలో ఆడపిల్లలతో డిఆర్‌ఓ పెంచల కిషోర్

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భేటీ బచావో అండ్ భేటీ పడవో (బాలికను రక్షించండి – బాలికను చదివించండి)పై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. డిస్ట్రిక్ట్ రెవెన్యూ అధికారి పెంచల కిశోర్ మాట్లాడుతూ శిశు లింగ నిష్పత్తిని పెంచడం, లింగ వివక్షతను లేకుండా చేయడం, ఆడ పిల్లలను రక్షించి, చదివించాలన్నదే భేటీ బచావో భేటీ పడవో పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భ్రూణ హత్యలను, బాల్య వివాహాలను అరికట్టుటకు అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో పనిచేయాలని తెలిపారు. ఆడ పిల్లలు పుట్టడం అదృష్టంగా భావించాలని, మగ పిల్లలతో సమానంగా పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్స్ పైన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి పెట్టాలని, లింగనిర్ధారణ చేయకూదని తెలిపారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిని జయలక్ష్మి, మహిళా పోలీస్ స్టేషన్ డిసిపి ఎం.శ్రీలత మాట్లడుతూ పిల్లలకి, మహిళలకు సంబంధించి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆడ పిల్లలు బాగా చదువుకొని వాళ్ళ కాళ్ళ పై వాళ్ళు నిలబడి ఏ రంగంలో అయిన మగవారితో సమానంగా ఎదగాలని తెలిపారు. మగ పిల్లలకు స్కూల్లలో మరియు కాలేజీలలో గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టవలసిన ఆవశ్యకత గురించి తెలిపారు. మిషన్ వాత్సల్య, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవాణి బ్రేక్ దర్శన టికెట్ల జనవరి నెల కోటా విడుదల

**ప్రజాశక్తి- తిరుమల:** శ్రీవాణి బ్రేక్ దర్శన టికెట్ల 2025 జనవరి నెల కోటాను బుధవారం ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేసింది. రోజుకు 500 టికెట్లు, 100 గదుల చొప్పున భక్తులకు అందుబాటులో ఉంచింది. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 2025 జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు టికెట్ల విడుదల వాయిదా వేయడమైందని, భక్తులు గమనించి తదనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో టిటిడి పేర్కొంది.

## తిరుపతి- కాచిగూడ స్పెషల్ రైళ్లు రద్దు

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** దీపావళి పర్వదినం సందర్భంగా కాచిగూడ – తిరుపతి స్పెషల్ తిరుపతి – కాచిగూడ స్పెషల్ రైలు ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ పేర్కొన్నారు. ఈనెల 29, నవంబర్ 5, 12వ తేదీల్లో కాచిగూడ – తిరుపతి (07063) స్పెషల్ రైలును రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ రైలు కాచిగూడ నుంచి ఆయా తేదీల్లో రాత్రి 10.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.10 నిమిషాలకు తిరుపతి చేరుకుంటుందని, అయితే ప్రయాణికులకు ఇది సౌకర్యంగా లేకపోవడం వల్ల టికెట్ బుకింగ్ చేసుకోలేదని తెలిపారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి – కాచిగూడ (07064) ఈనెల 30న నవంబర్ 6, 13వ తేదీల్లో ఈ స్పెషల్ రైలు బయలుదేరనుందని, వీటిని కూడా రద్దు చేసినటు పేర్కొన్నారు. 'దానా' తుఫాన్ ప్రభావంతో తూర్పుకోస్తా, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలోని వివిధ మార్గాల్లో మొత్తం 41 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఒడిశా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నట్టు సీపీఆర్ఎ శ్రీధర్ తెలిపారు. ప్రధానంగా రద్దయిన రైళ్లలో సికింద్రాబాద్ తిరుపతి, భువనేశ్వర్, పూరీ, తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, రామేశ్వరం, సికింద్రాబాద్, తిరుపతి, షాలీమార్, కన్యాకుమారి, చెన్నై, ప్రాంతాలకు వెళ్ళే రైళ్లు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు.

# గిరిజనులకు పట్టాలు ఇచ్చే వరకు పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు

**ప్రజాశక్తి - దొరవారిసత్రం**
గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేసేంతవరకు పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట సిపిఎం నాయకులు, గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలోని తనయాలి గ్రామంలో సర్వే నెం 1లోని సుమారు 309 ఎకరాల ప్రభుత్వ భూమిని 1976 సంవత్సరంలో గిరిజనలకు సిజెఎఫ్ఎస్ పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు గిరిజనులు తమ భూములను సాగు చేస్తున్నారని, ప్రభుత్వం సొసైటీలను రద్దుచేసి వ్యక్తిగతంగా డికెటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. కాగా గ్రామంలోని ఇతర కులస్తులకు డీకేటి పట్టాలు మంజూరు చేసి 50 గిరిజన కుటుంబాలకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పట్టాలు, పాసుపుస్తకాలు లేని కారణంగా గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు, సబ్సిడీలు పొందలేక పోతున్నారని తెలిపారు. గత 40 సంవత్సరాలుగా అనుభవంలో ఉన్న వీరికి పట్టాలు ఇవ్వడం లేదని, ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని పలుసార్లు అధికారులను విన్నవించుకున్న పట్టించుకున్న పాపానపోలేదని పేర్కొన్నారు. గిరిజనులకు పట్టాలు, పాసు పుస్తకాలను మంజూరు చేయకపోతే సిపిఎం ఆధ్వర్యంలో భూపోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గిరిజన సమస్యలపై తహశీల్దారు శైలకుమారికి వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన తహశీల్దారు శైల కుమారి గిరిజనుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుందా, నాయకులు లక్ష్మణ్, సరసమ్మ, బాలకృష్ణ, బత్తయ్య, మునెమ్మ, ముని కృష్ణారెడ్డి, గిరిజన రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

# 'గడువు లోపు పనులు పూర్తి చేయండి'

### స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య


సమావేశంలో మాట్లాడుతున్న స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు గడువు లోపు పూర్తి చేయాలని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై బుధవారం స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఆలస్యం అవ్వడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన గడువు లోపు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఐట్రిపుల్ సి ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరగనుందని అన్నారు. పర్యవేక్షణ లోపంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయని అన్నారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా చేయాలన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా అనుకున్న మేర పనుల పూర్తి చేయాలన్నారు. ఈ కేంద్రం ద్వారా నగరంలో భద్రత మరింత పెరుగుతుందని అన్నారు. అలాగే వాహనాల రాకపోకల నియంత్రణ, నగరంలో కాలుష్య నియంత్రణ, యూజర్ చార్జీల వసూళ్లు, అపరాధ రుసుము విధింపు వంటి కార్యక్రమాలు ఈ సెంటర్ ద్వారానే సాగించేందుకు వీలుంటుందని అన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోతులు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** గూడూరు – రాపూరు మినీ బైపాస్ రోడ్డు, విందూరు రోడ్డులో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారరని వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగిశివ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం గుంతల పడిన రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్ అండ్‌బి అధికారులకు పలు దఫాలు రోడ్డు మరమ్మతుల సమస్యలపై విన్నవించుకోవడం జరిగిందని అయినా పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోఉడ్డలు మరింత పాడై వాహనదారులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. గోగినేనిపురం సమీపంలోని సైదాపురం క్రాస్ రోడ్డు అధ్వానంగా ఉందని తిరుపతి, కడపకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టానల కోరారు. నాయకులు పి.శ్రీనివాసులు, మని, సురేష్, శ్రీనయ్య, చంద్రయ్య, కోటి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను తోస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

### ఇసుకాసుర హస్తం
## తండ్రీకొడుకులు మృతి

ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, పడిన ఉన్న మృతుల బైక్

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ఇసుకాసురుల దాహానికి రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీ కొని తండ్రీ కొడుకులు మృతి చెందగా మహిళకు తీవ్ర గాయాలైన విషాద ఘటన బుధవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని దొమ్మరపాలెం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన కంచి రాజేంద్ర(35) తన భార్య గురవమ్మ(35), కుమారుడు చైతన్య(5)తో కలిసి బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తి పట్టణానికి సొంత పనుల నిమిత్తం వెళ్ళాడు. ఈ క్రమంలో పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా మార్గం మధ్యలో దొమ్మరపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్ ఎదురుగా ఢీకొంది. ఈ ఘటనలో రాజేంద్ర, ఆయన కుమారుడు చైతన్య ప్రమాదస్థలిలోనే మృతి చెందగా, భార్య గురవమ్మ తీవ్రంగా గాయపడింది. మృతదేహాలను రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ గురవమ్మను చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇసుక ట్రాక్టర్‌ను అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ఇసుకాసురులు ఎలాగోలా కళ్ళుగప్పి సరిహద్దులు దాటించేసి జేబులు నింపుకుంటున్న పరిస్థితి.

## రాంభట్లపల్లిలో 'రీ సర్వే' గ్రామ సభ

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:** తొట్టంబేడు మండలం, రాంబట్లపల్లి గ్రామంలో భూముల రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలపై బుధవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే సందర్భంగా రైతులకున్న అభ్యంతరాలను, ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ యు.మధుసూధనరావు గ్రామస్తులను కోరారు. ఆ మేరకు 38 సమస్యలు రైతుల నుంచి రాగా పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దారు హామీ ఇచ్చారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రాఘవయ్య, మండల సర్వేయర్ హరినాథ్ పాల్గొన్నారు.

## పరిసరాల పారిశుధ్యం పాటించండి

**పజాశక్తి -దొరవారిసత్రం:** విద్యార్థులు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల భారినపడకుండా ముందుస్తు జాగ్రత్తలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని కెజీబీవీ బాలికల, ఎంజెపి బాలుర గురుకులం, సోషల్‌వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో ఫీవర్, లార్వా సర్వేతోపాటు శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక ఏకొల్ల పిహెచ్‌సి వైద్యసిబ్బందితో కలిసి హాస్టల్స్‌లోని పారిశుధ్యాన్ని పరిశీలించారు. వంట గది, తాగునీటి నిల్వ ఉన్న వాటర్ ట్యాంకు, గదులు, పరిసరాలను తనిఖీ చేశారు. అలాగే ఆహార పదార్థాల నాణ్యత రుచిని పరిశీలించారు. ఎస్సీ బాలికల హాస్టల్ ఆవరణంలో ఉన్న పలు వృక్షాల వ్యర్థాలను తొలగించాలని సూచించారు. మరుగుదొడ్లు ప్రతిరోజు క్రిమిసంహారక మందులతో శుభ్రపరచుకోవాలన్నారు. దోమలు అవసాలు లేకుండా పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని సూచించారు. ఏఎన్ఎం డోరతి, శ్రావణి, ఆశ వర్కర్స్ మంజుల, అన్నపూర్ణ, నర్స్‌స్టాఫ్ మౌనిష, రెడ్డమ్మ, కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి, నర్సింగ్ స్టాఫ్ సుమతిలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

**ప్రజాశక్తి-కోట:** మండలంలోని చెందోడు పంచాయతీ పరిధిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.9.60లక్షల అంచనాలతో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేపట్టారు. కోట ఎంపీడీవో వేణు, టీడీపీ నాయకులు చేతుల మీదగా ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, నాయకులు రఘురామ్, విజయభాస్కర్ రెడ్డి, కృష్ణ, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణా రెడ్డి, షేక్.మస్తాన్ బాషా, ఉపాధి టీఏ చంద్రశేఖర్, పద్మమ్మ, ఎఫ్ఏ అనిత, స్థానికులు పాల్గొన్నారు.

## దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** దీపావళి పర్వదినం సమీపిస్తున్న తరుణంలో టపాకాయల దుకాణాల ఏర్పాటుకు బుధవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. ప్రతి ఏటా నిర్వహించే ఏరియా ఆసుపత్రికి వెళ్లే మార్గంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, డిఎస్పి నరసింహమూర్తి పరిశీలించారు. ఇక్కడ టపాకాయల విక్రయ కేంద్రాన్ని నిర్వహించరాదంటూ విద్యార్థి సంఘాలు అభ్యంతరం చెప్తున్న నేపథ్యంలో ఈ మేరకు ఆర్డీఓ పరిశీలనకు రావడం జరిగింది. కలెక్టర్‌తో చర్చించి తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆర్డీవో చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లివర్ బాధిత బాలునికి రూ.7లక్షల చెక్కు పంపిణీ

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

**ప్రజాశక్తి-పిచ్చాటూరు:** మండలంలోని కారూరుకు చెందిన లివర్ బాధిత బాలుడు సి.నితీష్ (10) కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రూ. 7లక్షల సహాయ నిధి చెక్కును అందించారు. కారూరుకు చెందిన ప్రకాష్ కుమారుడు సి.నితీష్‌కు లివర్ సమస్యతో ప్రాణాపాయం ఉన్నట్లు స్థానిక టీడీపీ నాయకులు కొల్లాపురి రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఇలంగోవన్ రెడ్డిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాలుని వివరాలు సేకరించి, సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం, బాలుని చికిత్స ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 7లక్షలు మంజూరు చేసి చెక్కును పంపిచారు. ఆ చెక్కును బుధవారం బాధిత బాలుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

## పాఠశాలలో రికార్డులు పరిశీలన

విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఈవో

**ప్రజాశక్తి-కోట:** పాఠ్య పుస్తకాలపై అవగాహన ఆసక్తిని పెంచుకోవాలని ఎంఈవో దారా మస్తానయ్య విద్యార్థులకు సూచించారు. బుధవారం కోట మండలంలోని చంద్రశేఖర పురంలోని ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచిని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో కొంత సమయం ముచ్చటించారు. విద్యార్థులతో కలిసిమెలిసి ఆప్యాయతగా ఉంటూ పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోధనతో పాటు ఆట, పాటలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

## సుబ్బరాయున సేవలు అభినందనీయం

▶ డివైఈవో ప్రభాకర్ రాజు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** గోపాల కృష్ణాపురం హెచ్ఎం సుబ్బరాయున సేవలు అభినందనీయం అని పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు అన్నారు. పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణ పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 30వ తేదీ పదవీ విరమణ చేసిన హెచ్ఎం సుబ్బరాయునకి బుధవారం విజయలక్ష్మి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం జరిగింది. పలువురు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రభాకర రాజు సుబ్బరాయుని సేవలను కొనియాడారు. తిరుమల రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీవైఈవో ప్రభాకర్ రాజు

# పనులు ఫుల్.. పేమెంట్ నిల్

▶ డి మస్టర్ పేరుతో ఇబ్బంది పెడుతున్న అధికారులు

▶ లక్షల్లో నగదు చెల్లింపు నిలిపివేసిన ఏపీవో

▶ ఆందోళనలో ఉపాధి హామీ కూలీలు, రైతులు

ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు

**ప్రజాశక్తి-యర్రావారిపాళ్యం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు విరివిగా ఉపాధి పనులు మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే గ్రామ సభలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు ఎంపిక చేశారు. అయితే యర్రావారిపాళ్యంలో మాత్రం పనులు ఫుల్.. పేమెంట్ నిల్ అన్న చందంగా పరిస్థితి మారింది. పనులు చేస్తున్న కూలీలకు డి మస్టర్ పేరుతో అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. లక్షల్లో నగదు నిలుపుదల చేశారు. ఇటీవల జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భారీగా అవకతవకలు వెలుగుచూశాయి. ఫలితంగా గతంలో పనిచేసిన సిబ్బంది, ఏపీవోపై సెస్పెన్షన్ వేటు పడింది. దీంతో అధికారులు చిన్నగొట్టిగల్లు మండలంలో పనిచేస్తున్న ఏపీవోకు యర్రావారిపాళ్యం మండలానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే రైతులు, కూలీలు ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. అధిక సంఖ్యలో కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. అయితే సకాలంలో సొమ్ము చెల్లించకపోవడంతో వారు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పలు మార్లు ఏపీవోకు సమస్యను వివరించినా పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు రైతులు వాపోతున్నారు. రైతులు పనులు చేస్తున్నప్పటికీ బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని, విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. లేని పక్షంలో ధర్నా చేపట్టేందుకు వెనుకాడమని తెగేసి చెబుతున్న మాట. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు.

## 'సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలి'

విద్యార్థులను ప్రశంసిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-రామచంద్రాపురం:** విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలని హెచ్ఎం, ఎస్‌టీయూ గాజుల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తిరుపతి మహతీ ఆడిటోరియంలో భారతీయ కళాఉత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు, పథకాలు అందుకున్నారు. ఉత్తమంగా రాణించిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు మన సాంప్రదాయాలను ఆచరించి భవిష్యత్తు తరాలవారికి అందించాలని చెప్పారు. క్రమశిక్షణ కలిగి విద్యతో పాటు కో కరిక్యులర్ విషయాలలో కూడా ప్రతిభ చాటాలన్నారు. కార్య క్రమంలో తెలుగు ఉపాధ్యాయులు జయశ్రీ, కామేశ్వరి, శివకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్‌కి అవార్డు ప్రదానం.. పలువురి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** పట్టణానికి చెందిన మైనారిటీ పరిరక్షణ సమితి అధ్యక్షులు ఏదుల్లా హుస్సేన్‌కి బహుజన సాహిత్య అకాడమీ 8వ నేషనల్ కాన్ఫరెన్స్ తిరుపతిలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు అందుకున్నారు. ముస్లిం మైనారిటీల కోసం అహర్నిశలు కృషి చేసిన సందర్భంగా ఈ అవార్డు రావడం జరిగిందని అన్నారు. అవార్డు వచ్చిన సందర్భంగా పుత్తూరు పట్టణం ముస్లిం మైనారిటీ సోదరులు బుధవారం ఆయనను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హుస్సేన్‌ను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

కార్యక్రమంలో నాయకులు రఫీ అహమ్మద్, మహమ్మద్, గౌస్, సందాని, శబ్బర్, చాను, హమీద్ బాషా, నజీర్, యునస్, షకీల్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** రాష్ట్రీయ సేవ సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం బుధవారం పుత్తూరు స్థానిక ఎన్జీవో కాలనీలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. టాటా ట్రస్ట్ హాస్పిటల్, తిరుపతి వారి (శ్రీకర్) ఆధ్వర్యంలో బిపి, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భ సంచి వంటి ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయశాఖ సయహాధికారి చంద్రశేఖర్ ముఖ్య అతిధిగా విచ్చేసి, రాస్ సేవలు గర్వించదగినది అని, వైద్య పరీక్షలు, కంటి ఆపరేషన్, వృతి శిక్షణలు, సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం వంటివి తరుచు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళకు ప్రత్యేకించి ఎన్నో రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తుండడం దీని గమనించి రాస్ సంస్థ వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య ఉచిత వైద్య కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరం అన్నారు. మనకు ఎంతగానో

ఉపయోగపడుతున్న రాస్ సంఘాలు సభ్యులకు మాత్రమే కాకుండా వారి కుటుంబాలకి కూడా ఉపయోగపడడం చాలా ఆనందించదగ్గ విషయం అని తెలిపారు. అనంతరం టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ రాస్ సంస్థ సహకారంతో గత 9 సంవత్సర కాలంగా పుత్తూరు పరిసరాలలో ఈ విధమైన ఆరోగ్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 80మంది మహిళలు, పురుషులు పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అమరావతి, రెడ్డికుమారి, మహింద్రా, రాస్ సిబ్బంది ప్రకాష్, కమలమ్మ, సంఘాల సభ్యులు, లిడర్లు పాల్గొనారు.

## టిడ్కో ఛైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన జనసేన నేతలు

**ప్రజాశక్తి-చిట్టమూరు:** రాష్ట్ర టిడ్కో శాఖ ఛైర్మన్‌గా వేములపల్లి అజయ్ బాబుకి బాధ్యతలు అప్పగించడంతో బుధవారం విజయవాడలో జరుగుతున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చిట్టమూరు మండలం కోగిలికి చెందిన జనసేన నాయకులు ఎంబేటి ప్రవీణ్ హాజరైయ్యారు. కుదురు రాము, యర్రమతి నవీన్, బట్ట నాగేంద్ర, పిట్టు రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్‌పై వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్ఐ విశ్వనాథ నాయుడు విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ వ్యాసరచన పోటీలలో భాగంగా మొదట బహుమతి జోష్న, రెండో బహుమతి వైష్ణవి, మూడవ బహుమతి అస్మితలను ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు ఎస్ఐ, హెచ్ఎం రమణయ్య ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయిలో ఉండి పదిమందికి సహాయపడే విధంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు కిషోర్, మస్తాన్, ముని పాల్గొన్నారు.

## డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పెంపు

**ప్రజాశక్తి -కోట:** అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డిఎస్సి ఉచిత శిక్షణకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పెంచినట్లు గూడూరు ఏఎస్ డబ్ల్యూఓ వి.మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గూడూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వి.మనోజ్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు మేరకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత బోధన, భోజనం వసతి సౌకర్యాలతో మూడు నెలలు పాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## సరైన ఆలోచన విధానంతోనే జీవితాల్లో మార్పు

▶ అసిస్టెంట్ ఆఫీసర్ రాజేంద్రుడు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** సరైన ఆలోచన విధానాలతోనే జీవితాల్లో మార్పులు జరుగుతాయని వ్యక్తిత్వ వికాస్ నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్రుడు పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలంలోని గోపాల కృష్ణాపురం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పిల్లలకు పరీక్షల భయం ఎలా వీడనాడాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులు పిల్లలు వారి జీవితాలలో ప్రేరణ నింపి సన్మార్గంలో

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజేంద్రుడు

నడవడానికి కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. చదువు ప్రాముఖ్యతను జీవితపు విలువలను ఈ సెమినార్లో వివరించారు.

## స.హ చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఆ చట్టంపై సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది ప్రగ్నశ్రీ స.హ చట్టం ఆవశ్యకతను విద్యార్థులకు విశదీకరించి చెప్పారు. స.హ చట్టం ద్వారా ఎవరినుంచైనా సమాచారం కోరే హక్కు ఉంటుందని తెలిపారు. స.హ చట్టం ప్రజల చేతుల్లో వజ్రాయుధమనీ, ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేసేలా దోహదపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ స.హ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహ వర్మ, పరంధామయ్య, సతీష్ కుమార్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పాకాల మండల అగ్రికల్చర్ అధికారిని పుష్పవతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కావలి వారిపల్లి పాతూరు ఆర్బికే పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు క్రిష్ణమనేని సావిత్రి ప్రభాకర్, సర్పంచ్ చెంగల్రాయులు, వెటర్నరీ డాక్టర్

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోహన్ కుమారి, అనిల్, రవి, రూపేష్, వార్డు సభ్యుడు విజయ, జగదీష్, ప్రభావతి, సాంబయ్య, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

▶ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి శ్రావణిరెడ్డి

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** పురపాలక పరిధిలోని చెన్నూరు సచివాలయం-2లో ఆధార్ సెంటర్‌ను తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరు -2 సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. 5 సంవత్సరలు దాటినా పిల్లలుకు పూర్తి ఉచితంగా ఆధార్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఫొటో అప్డేట్ చేసుకోని వాళ్ళు, ఆధార్‌కి ఫోన్ లింక్ కూడా చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని

ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శ్రావణిరెడ్డి

సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హేమకుమార్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కృష్ణయ్య, రమణయ్య, అశోక్, కృష్ణమూర్తి, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ప్రహరీ కట్టడాలు అడ్డుకోవాలని వినతి

**ప్రజాశక్తి-తిరుపతి డెస్క్:** నారాయణవనం మండలంలోని బ్రాహ్మణ తంగల్ పంచాయితీకి చెందిన సర్వే నెంబరు 65/1 వడ్డీ ఇండ్ల గ్రామ కంఠాన్ని సర్వే నెంబరు 72లో అక్రమంగా ఆక్రమించుకుని ప్రహరీ గోడ కట్టడాలను అడ్డుకోవాలని వార్డు సభ్యులు కన్నదాస్, ధనలు కోరారు. బుధవారం తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. అక్రమంగా కట్టడాలు చేపడుతున్న వెంచర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలా లేని పక్షంలో విషయాన్ని కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళతామని వారు తెలిపారు.

## గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

▶ ఎమ్మెల్యే పులివర్తి నాని

**ప్రజాశక్తి-రామచంద్రాపురం:** గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం మండలంలోని పరమాల, మిట్ట కండ్రిగ, టిటి కండ్రిగ, వడ్డీ కాలువ, రాయలచెరువు, సికేపల్లి, పార్వతీపురం, కూనేపల్లి అనుపల్లి, బొప్పరాజు పల్లి, గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ చీకటి పాలనతో చితికిపోయిన గ్రామాలలో పల్లె పండుగతో అభివృద్ధి మెండుగా నిర్వహించటానికి కృషి చేస్తానన్నారు. రూ.2.50 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి బిందు మాధవి,

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

టిడిపి నాయకులు బండి విజయ్ కుమార్ రెడ్డి, బొడ్డు మధుసూదన్ రాయల్, బోడిరెడ్డి పురుషోత్తం రెడ్డి, ఎం సుధాకర్ రాయల్, ఎం తిరుమలరెడ్డి, ఎం చిన్నబాబు, టి కేశవులు నాయుడు, జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పాత నేరస్తుడు అరెస్టు

▶ రూ.20లక్షల సొత్తు స్వాధీనం

నిందితుడిని అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** విలాసాలకు అలవాటు పడి దొంగతనాలే వృత్తిగా ఎంచుకున్న ఓ కరుడుగట్టిన పాత నేరస్తుడిని శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.20లక్షలు విలువజేసే బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ల్యాప్టాప్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో శ్రీకాళహస్తి డిఎస్పి కే.నరసింహమూర్తి మీడియాకు వెల్లడించారు. శ్రీకాళహస్తి, బుచ్చినాయుడు కండ్రిగ, రేణిగుంట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల తాళాలు వేసిన ఇళ్లల్లో వరుస చోరీలు జరిగాయి. పెద్ద ఎత్తున బంగారం, వెండి, నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు అపహరణకు గురయ్యాయి. ఆ మేరకు సదరు చోరీలపై ఆయా పోలీస్ స్టేషన్ల యంత్రాంగం నిఘా పెట్టింది. ఈ క్రమంలో శ్రీకాళహస్తి ఆర్టిసి బస్టాండ్ కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని వన్ టౌన్ పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా నిందితుడు చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన భరద్వాజన్ ప్రేమ్ కుమార్ అలియాస్ కుమార్(30)గా గుర్తించారు. నిందితుడి వద్ద 220 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.180 కిలోల వెండి, యాసిస్ లాప్టాప్, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు కుమార్‌పై ఇదివరకే చెన్నైలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 20కు పైగా దొంగతనం కేసులు ఉన్నాయనీ, పలు కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో విశేష చొరవ చూపిన వన్ టౌన్ సిఐ గోపి, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, ఏఎస్ఐలు గంగయ్య, చక్రవర్తి, కానిస్టేబుళ్లు హేమాద్రి, రవి, ప్రసాద్, కేశవన్, బాలకృష్ణ గంగాధరంలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్య, రూరల్ సీఐ రవి నాయక్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చెంచయ్య మృతదేహం

**ప్రజాశక్తి-పెళ్లకూరు:** పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామం వడ్డీ పాలెంకు చెందిన బండి చెంచయ్య (48) బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో కొంతమంది పశువుల కాపర్లు చిల్లకూరు గ్రామానికి వడ్డీపాలానికి మార్గమధ్యలో పొలాలలో మృతి చెందడం చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు, సమాచారం తెలుసుకున్న పెళ్లకూరు పోలీస్ వారు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు, మృతి చెందిన చెంచయ్యకు భార్య ప్రమీల ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెంచయ్య మృతి పట్ల గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఇది ఇలా ఉండగా కొంతమంది ఇది హత్య అని అనుమానంగా ఉందని చెబుతున్నారు. పంచనామా అనంతరం నిజా నిజాలు తెలియాల్సి ఉంది. పెళ్లకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ, బైక్ ఢీ

▶ ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** నాయుడుపేట జాతీయ రహదారిలోని తనపల్లి క్రాస్ వద్ద బుధవారం లారీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైయ్యాయి. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తనపల్లి ఇందిరమ్మ గృహ సముదాయంలో నివాసముంటున్న మంజు, మణి స్థానికంగా మేస్త్రీ పని చేసేవారు. ఈ క్రమంలో సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లివస్తుండగా స్థానిక తనపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా చంద్రగిరి నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మంజు (28) అక్కడికక్కడే మృతిచెందగా, మణికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి 108సహాయంతో గాయపడిన వ్యక్తిని రుయా ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## మెగా కార్మికుడికి గాయాలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** మదనపల్లి - నాయుడుపేట జాతీయ రహదారి వెంబడి విద్యుద్దీకరణ పనులు చేస్తున్న ఓ మెగా కంపెనీ కార్మికుడు బుధవారం ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని చెర్లోపల్లి వద్ద విద్యుద్దీకరణ పనులు చేస్తుండగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సమరుల్(25) 11కేవీ విద్యుత్ తీగ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు ఆయనను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెగా యాజమాన్యం కార్మికులకు కనీస రక్షణ అవసరాలు తీర్చకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

## అగ్గిపెట్టి మచ్చాపై దాడి

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** సోషల్ మీడియా రారాజు కిరణ్ (అగ్గిపెట్టి మచ్చా)పై కొంతమంది ఆకతాయిలు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన కిరణ్ (అగ్గిపెట్టి మచ్చా) ఇటీవల కాలంలో యూట్యూబ్ సెలబ్రేట్‌గా మారారు. ఈనెల 25 తేదీ ఆదివారం చెర్లోపల్లి సమీపంలో మద్యం సేవిస్తున్న సమయంలో కొంతమంది వ్యక్తులు అతనిపై దాడికి దిగారు. అక్కడి నుంచి తప్పించుకున్న కిరణ్ లీలామహల్ సమీపంలోని అమెరికన్ బారు వద్దకు చేరుకున్నారు. అక్కడ మద్యం చేస్తున్న సమయంలో కొంతమంది యువకులు అతనిపై గొడవకు దిగారు. మాట మాట పెరగడంతో కిరణ్‌పై దాడి చేసి గాయపరిచారు. మధ్యమధ్యలో ఉన్న కిరణ్‌ను స్థానికులు క్షేమంగా ఇంటికి చేర్చారు. తలపై జరిగిన దాడికి సంబంధించి, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అలిపిరి పోలీసులకు కిరణ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

## నగేష్‌కు యావజ్జీవ శిక్ష

**ప్రజాశక్తి-తిరుపతి డెస్క్:** కెవిబి పురం మండలంలోని పూడి సికె పురం గ్రామంలో 2019లో ఘోర సంఘటన చోటు చేసుకుంది. వివరాలకు వెళితే.. అదే గ్రామానికి చెందిన వంశీకృష్ణ వ్యక్తి నగేష్ భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అన్న అనుమానంతో వంశీకృష్ణను నగేష్ నమ్మబలికి గ్రామం సమీపంలో ఉన్న అడవికి తీసుకెళ్లి అతి గోరాతి ఘోరంగా హత్య చేశాడు. ఆ ఘటనకు సంబంధించిన తీర్పు బుధవారం వెలువడింది. నేరం రుజువు కావడంతో ముద్దాయి నగేష్‌కు న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించినట్లు కేవిబి పురం ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు.

**IN THE COURT OF ADDITIONAL DISTRICT JUDGE NO: IV AT PONNER**
**MCOP NO: 97/2022**

1.Roja
2.Vishva
3.Vishnu
4.Vishal
5.Neela - **Petitioners**

**Vs**

Naveen Vekkanti -**Respondent**

**To**
Naveen Vekkanti, S/o.Anjaneyalu, No.7-262/2, Sujatha Nagar Line, Ongole, Prakasam District, Andhra Pradesh, Pin Code-523001. -**Respondent**

Please take Notice that the above case was filed by the Petitioner for Compansation, same was posted for your appearance to make any Objection on 03/ 12/2024 at 10.30 A.M. either in person or through your counsel if you fail to appear on that day case will be decided as Exparte.

**S.C.PALLAVAN,** B.Sc., B.L.,
Counsel for Petitioner

**IN THE COURT OF ADDITIONAL DISTRICT JUDGE NO: IV AT PONNER**
**MCOP NO: 255/2023**

1.Bhuvaneswari
2.Piruthivirajan - **Petitioners**

**Vs**

1.Manikandan
2.National Insurance Co. Ltd -**Respondents**

**To**
**R1:** Manikandan, S/o.Marimuthu, D.No.18-162, Sai Nagar, Yalamala Kuduru, Vijayawada, Penamaluru, Krishna, Andhra Pradesh, Pin Code-520007. -**1st Respondent**

Please take Notice that the above case was filed by the Petitioner for Compansation, same was posted for your appearance to make any Objection on 06/ 11/2024 at 10.30 A.M. either in person or through your counsel if you fail to appear on that day case will be decided as Exparte.

**S.C.PALLAVAN,** B.Sc., B.L.,
Counsel for Petitioner